క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


ప్రత్యేక అలంకరణలో బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు:మండలంలోని బిక్కవోలు కొలువైన ఉన్న శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో భాస్కర్,సిబ్బంది ప్రసాద్,సత్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నేతలకు సన్మానం

పెదపూడి: తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ నేతలను సన్మానించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తిలో ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంద్ర వందిత్(రాజా), తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు అభినందనలు తెలియజేస్తూ సన్మానించనున్నట్టు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

రాజ రాజేశ్వరి సన్నిధిలో అన్న సమారాధన


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కాపవరం, కోరుకొండ, జంభూపట్నం, శ్రీరంగపట్నం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అన్న సమారాధన నిమిత్తం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీకీ నగదు అందజేశారు. అన్న సమారాధనలో ఆయన పాల్గొని, అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

జాబ్ మేళాలో 37 మంది ఎంపిక


జాబ్ మేళాలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 37 మందికి ఉద్యోగాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీడీయం ఫార్మసీ, ఎంబిఏ విద్యార్హతలున్న 69 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మూడు కంపెనీలు పాల్గొని తమకు అవసరమైన, అర్హతలున్న 37 మందిని ఇంటర్వ్యూలో ఎంపిక చేశారు. ఎంపీడీఓ జేపీ ఝాన్సీ, ఏపీఎస్ఎస్‌డీసీ ఏడీ ఎస్‌డీఓ పెరుమాళ్‌రావు, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ ప్రతినిధి జేఈ రవి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


పత్రం అందుకుంటున్న నూతన అధ్యక్షుడు వెంకటరమణ

రంగంపేట: ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటీరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కుందేటి వెంకటరమణ నియమితులయ్యారు. వడిశలేరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాత కమిటీలను రద్దు చేసిన ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్ బాబు... వెంకటరమణను నూతన అధ్యక్షుడిగా ప్రకటించి, నియామక పత్రాన్ని అందించారు. అనంతరం వెంకటరమణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ కొడి కిషోర్,కాకినాడ జిల్లా చైర్మన్ డొక్కా దుర్గారావు,జగ్గంపేట మండలం చైర్మన్ చిలుకోటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సొంతిల్లు కలేనా

- భారంగా మారిన ఇసుక, సిమెంట్
- అందుబాటులో లేని ముడిసరుకులు
- మార్చిలోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలంటున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు


జి.మామిడాడ గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు

పెదపూడి: కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో పేదోళ్ల సొంతింటి కల.. కలగానే మిగిలేలా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు చాలా వరకు లబ్ధిదారులు నిర్మించుకోగా వివిధ సమస్యల మూలంగా కొన్ని ఇళ్లు పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్లు నిర్మించుకోవడం మరింత భారంగా మారింది. ఇసుక అందుబాటులో లేకపోవడంతో పాటు ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో లబ్ధిదారులున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో ...

అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 10,950 ఇళ్ల నిర్మాణానికి మంజూరు లభించింది. వాటిలో 3,774 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. 3,247 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 3,929 ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించలేదు. అయితే వీటిలో వివిధ దశల నిర్మాణంలో ఉన్న ఇళ్లను మార్చి నెలలోపు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. లేకపోతే రద్దు చేస్తామని హెచ్చరిస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఆ నిర్మాణాలు చేపట్టడానికి ముడి సరుకులు అందుబాటులో లేక సతమతమవుతున్నారు. ఏదోవిధంగా ఇళ్లు నిర్మించుకుందామంటే ఇసుక దొరకడం లేదు. ఇదే విధంగా సిమెంట్ , ముడిసరుకులు అందుబాటులో లేవు. ఇసుక సిమెంట్‌తోపాటు ఇతర ముడిసరుకుల ధరలు పెరిగాయి. దీంతో పేదలు అయోమయానికి గురవుతున్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల ముందు అర్బాటంగా ప్రకటించిన ఉచిత ఇసుక పథకం ఇంతవరకు ఎక్కడా అమలు కాలేదు. ప్రస్తుతం 6 యూనిట్లు ఇసుకను సుమారు రూ. 25వేల పైగానే అమ్ముతున్నారు. అయినా అందుబాటులో లేదు. సిమెంట్, స్టీల్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. దీంతో ముడి సరుకుల కొనలేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో...

పేదవాడికి సొంతింటికల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. లబ్ధిదారులకు సిమెంట్,ఇసుక,ఐరన్ కడ్డీలు, మరుగుదొడ్డికి అవసరమైన సామగ్రి,ఎలక్ట్రికల్ వస్తువులు, తలుపులు, కిటికీలు సమకూర్చింది. గృహ నిర్మాణాలు వేగవంతంగా సాగాయి. జగనన్న కాలనీలు ఊళ్లనే తలపించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే చాలామంది పేదలు సొంత ఇళ్లలో జీవనం సాగిస్తున్నారు. వ్యక్తిగత సమస్యలు, ఎన్నికల కోడ్ మూలంగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోలేని పేదలకు ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మండలం	మంజూరు	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్న ఇళ్లు	నాట్ స్టార్టెడ్ ఇళ్లు
అనపర్తి	2,105	685	1231	189
బిక్కవోలు	1,961	486	1256	219
పెదపూడి	2,727	808	510	1409
రంగంపేట	4,157	1795	250	2112
మొత్తం	10,950	3,774	3247	3929

అధికారులను నిలదీసినా..

ఇసుక,సిమెంట్ సమస్య అనపర్తి నియోజకవర్గంలో తీవ్రంగా ఉంది. నియోజకవర్గంలోని జగనన్న కాలనీలో మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించగా పేదల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన మండల అధికారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకున్న లబ్ధిదారులు, మేస్త్రీలు ఇసుక దొరకడం లేదని నిలదీశారు. అసలు ఇసుక ఎక్కడుందో తెలియడం లేదని, బ్లాక్‌లో దొరికినా ట్రాక్టర్ రూ.7వేలపైనే చెబుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇసుకను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ ఇదే పరిస్థితి నెలకొంది.

> **ముడిసరుకులు అందజేస్తాం**
>
> లబ్ధిదారులకు ముడి సరుకులు అందజేస్తాం. నిర్మాణాలపై సమీక్ష చేసి లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నాం. ప్రభుత్వం తరఫున సహకారం అందజేస్తున్నాం. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి.
>
> – ఎం.శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ పెదపూడి మండలం

గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కారం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి


నామవరం గ్రామసభలో కలెక్టర్ ప్రశాంతికి తమ సమస్యలు వివరిస్తున్న రైతులు


పెదపూడి గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతాపతిరావు

రాజానగరం: రీ సర్వే జరిగిన గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రస్తుతం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. మండలంలోని నామవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభని కలెక్టర్ సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రీ సర్వేపై అభ్యంతరాలు వ్యక్త పరిచేవారు అందుకు అవసరమైన డాక్యుమెంట్లను తీసుకు రావాలన్నారు. వాటి ఆధారంగా పరిశీలన చేసి, న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ గ్రామ సభలకు హాజరయ్యే అధికారులు ఆయా గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను వెంట తీసుకు రావాలన్నారు. ఆ విధంగా వస్తేనే రైతులు వెలిబుచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్, తహసీల్దారు ఎస్.లక్ష్మీ లావణ్య, ఎంపీడీఓ ఎస్జె ఝాన్సీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: భూసమస్యల పరిష్కారానికి నిర్వహించే రీసర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.వి.సీతాపతిరావు అన్నారు. రామేశ్వరంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన రీసర్వే గ్రామ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ సభలో రైతులు అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిట్టి తల్లి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సూర్యనారాయణ, కొటికలపూడి సత్తిబాబు, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్‌బాబు, పి.నాగేశ్వరరావు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారిపై ప్రయాణం సాహసమే..!


రామచంద్రపురం-వంగలపూడి మధ్య గోతులు పడిన రహదారి

- శిథిలమైన సీతానగరంపురుషోత్తపట్నం రోడ్డు
- పట్టించుకోని పాలకులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

సీతానగరం: సీతానగరం నుంచి పురుషోత్తపట్నం రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాలు సైతం తరచూ మరమ్మతులకు గురి కావడంతో వారంతా లబోదిబోమంటున్నారు. సీతానగరం-పురుషోత్తపట్నం మధ్య పది కిలోమీటర్ల మేర రహదారి పంచాయతీరాజ్ పరిధిలో ఉంది. ఈ రోడ్డును ఆనుకుని నాగరత్నం కాలనీ, సింగవరం, వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం గ్రామాలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడింది. ఇందులో వర్షం నీరు నిలువ ఉండిపోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. నీరు నిండి ఉండటంతో గొయ్యి ఎంత మేర ఉందో వాహన దారులు గ్రహించలేని దుస్థితి ఏర్పడింది. ఆర్టీసీ బస్సులు సైతం మరమ్మతులకు గురి అవుతున్నాయి. ఈ రోడ్డుపై ప్రయణం చేయాలంటే సాహసంగా మారింది. రహదారి దుస్థితిని గమనించిన రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గోతులను పూడ్చడానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దాదాపుగా నెలన్నర కావస్తున్నా గోతుల్లో ఒక గంపెడు మట్టి వేసిన దాఖలాలు లేవు. ఈ రోడ్డు దుస్థితి ఇక ఇంతేనా అంటూ మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాతకోటపాడు పాఠశాల స్థాయిని పెంచాలని విజ్ఞప్తి


పాతకోటపాడు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి నారాయణకు సమస్య తెలుపుతున్న పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ తోట ఈశ్వరి

రంగంపేట: పాతకోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి పెంచి, 9, 10 తరగతులను నిర్వహించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఈ.ఎస్.వి.వి.ఎల్ నారాయణను ఆ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ తోట ఈశ్వరి విజ్ఞప్తి చేశారు. పాతకోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ కోటపాడు నుంచి రంగంపేట 6 కిలోమీటర్ల దూరం, పెద్దాపురం 10 కిలోమీటర్ల దూరం ఉందన్నారు.బాలికలను అంతదూరం పంపి చదివించాలని కష్టంగా ఉందన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు భయపడుతున్నామని తెలిపారు. ఎనిమిదవ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలల్లో వచ్చే ఏడాది 9,10 తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రులు తరఫున అధికారులకు విన్నవించారు.ఈ సందర్భంగా ఉప విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ సంబంధిత ప్రతి పాదనలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో కె.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఆచంట వెంకటేష్, కొనే వెంకన్న ,బత్తిన వీరబాబు,విద్యా కమిటి సభ్యులు వరలక్ష్మి, నాగలక్ష్మి శివకుమారి,సూకరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

28న ఉచితంగా వినికిడి పరికరాల పంపిణీ

బిక్కవోలు: దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉచితంగా వినికిడి పరికరాలు అందిస్తున్నట్టు కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం జి.జి.హెచ్‌లో డెఫ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్- డెఫ్ ఫ్రీ భారత్ కార్యాక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పరికరాలు కావాల్సిన అర్హులైన వారు ఆధార్ కార్డు జిరాక్స్, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్, 2 ఫొటోలు ,గవర్నమెంట్ డాక్టర్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకుని వెళ్లాలని తెలిపారు.

పందెం కోళ్ల అపహరణ

రాజానగరం: మండలంలోని భూపాలపట్నంలో 13 పందెం కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి అపహరించుకు పోయారు. ఒక్కోదాని విలువ రూ.40 వేలు పై బడి ఉంటుందని అంచనా. గోదావరి జిల్లాలో సంక్రాంతి పండుగ సమయంలో కోళ్ల పందేలు విరివిగా జరుగుతుంటాయి. ఆ సమయంలో పందెం కోళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని నాలుగేళ్లుగా తన కమతంలో పందెం కోళ్లను పెంచుతున్నట్లు బాధితుడు రేలంగి గౌరీశంకర్ తెలిపాడు. పందెం రాయుళ్లకు విక్రయిస్తుంటానని చెప్పాడు. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఘనంగా పోచిరాజు శేషగిరిరావు శత జయంతి వేడుకలు


శేషగిరిరావుకు నివాళులు అర్పిస్తున్న వక్తలు

పెదపూడి: అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో 1947–1958 మధ్య కాలంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన దివగంత డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు శతజయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగు భాషాభిమానుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నారాయణరెడ్డి కంటి ఆస్పత్రి అధినేత, ప్రముఖ వైద్యుడు తేతలి సత్యనారాయణరెడి, ప్రముఖ మధుమేహ వైద్యుడు రామగుర్రెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ గౌరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. వారు ముందుగా పోచిరాజు శేషగిరి రావు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో విశేషసేవలందించిన డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు చిరస్మరణీయుడన్నారు. పెద్దాపురం మహారాణి కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా,తెలుగుశాఖాధిపతిగా, క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారన్నారు. ప్రముఖ పద్యకవిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతిగడించారని చెప్పారు. బహుకావ్యాలను రచించారన్నారు.ఈ కార్యక్రమంలో మేడపాటి చెల్లారెడ్డి, హెచ్ఎం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను సహించబోం

- మిల్లరు పారదర్శకంగా వ్యవహరించాలి
- ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్
- కాపవరంలోని రైస్ మిల్లుల తనిఖీ


కాపవరం రైస్ మిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణ నాయక్

మధురపూడి: ధాన్యం మిల్లుల్లో అవినీతి, అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్. కృష్ణ నాయక్ మిల్లుల యజమానులను హెచ్చరించారు. మంగళవారం ఆయన కోరుకొండ మండలం కాపవరంలోని 3 రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలును సక్రమంగా నిర్వహించాలని, రైతులకు ఎటువంటి ఆటంకాలు కల్గించ కూడదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మిల్లర్స్ వద్ద గోనె సంచులు ఉండాలన్నారు. వాటిని సకాలంలో రైతు భరోసా కేంద్రాలకు పంపించాలన్నారు. మిల్లుల సామర్థ్యంపై ఆరా తీశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రతి మిల్లు యజమాని బ్యాంకు గ్యారంటీ కల్గి ఉండాలన్నారు. బ్యాంకు గ్యారంటీ లేకపోతే కొనుగోలు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. పీడీఎఫ్ బియ్యాన్ని కొనుగోలు చేయడం నేరమని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఆయన వెంట కోరుకొండ తహసీల్దార్ వి.సుస్వాగతం, ఎంఎస్ఓ లంక సునీత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులు కీలకం

కొండ గుంటూరులో ఉపాధ్యాయులకు 'పునాది' అభ్యసన శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పప్పెట్ మాస్కులు ధరించి పాల్గొన్న ఉపాధ్యాయులతో డీఈఓ వాసుదేవరావు

రాజానగరం: ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో ఒకటి, రెండు తరగతులు ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. ఈ తరగతులు బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై బోధన చేయాలన్నారు. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న పునాది అభ్యసన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం డీఈఓ సందర్శించారు. శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన లెర్నింగ్ కార్నర్స్‌లో కొంతమంది ఉపాధ్యాయులు పప్పెట్ మాస్కులు ధరించి హాజరు కావడాన్ని డీఈఓ అభినందిస్తూ, ఇలా ఆటపాటలతో సాగించే అభ్యసనం విద్యార్థికి ఎక్కువ కాలం గుర్తుంటుందన్నారు. పునాది అభ్యసన శిక్షణా శిబిరం ముఖ్య ఉద్దేశం కూడా ఇదేనన్నారు. శిక్షణ పొందిన అనంతరం ఉపాధ్యాయులు కూడా తమ పాఠశాలలో ఆసక్తికరమైన టీఎల్ఎంలు తయారు చేయాలని సూచించారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి 250 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరయ్యారని సమగ్ర శిక్షా ఏఎంఓ గౌరీశంకర్ తెలిపారు. ఈ మూడు జిల్లాలకు చెందిన ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులందరికీ 14 బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తామన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఏఎంఓలు రామారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు. రిసోర్సు పర్సన్స్‌గా మోటుకూరి మంగారాణి, పి.ఇందుదేవి వ్యవహరించారు.

ప్రతిభ కనబరిచే ఉద్యోగులకు ప్రోత్సాహం


ఆర్టీసీ ఉద్యోగులను అభినందించిన డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే ఆర్టీసీ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్టు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచే ఉద్యోగులకు ప్రతీ నెల ఎంపిక చేసి, ప్రోత్సాహక నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించే కార్యక్రమాన్ని మంగళవారం డిపో గ్యారేజ్‌లో నిర్వహించారు. డిపో మేనేజర్ షేక్ షబ్నం మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో కండక్టర్లు, డ్రైవర్లు వారి కృషితో అత్యధిక ఆదాయాన్ని డిపోకు సంపాదించారన్నారు. డీజిల్ సేవింగ్ విషయంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించి, డిపో అభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించి, వారి మన్ననలు పొందాలని, ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా, ప్రమాదాలకు తావు ఇవ్వకుండా ఓర్పు, సహనంతో విధులు నిర్వర్తించాలని కోరారు. నలుగురు డ్రైవర్లు, నలుగురు కండక్టర్లు, ఇద్దరు గ్యారేజ్ సిబ్బందిని అభినందించారు. అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీరు (మెకానికల్) నాగలక్ష్మి పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతా రద్దు చేసి నగదు ఇప్పించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసిన కారణంగా, పీఎఫ్ ఖాతాలు రద్దు చేసి నగదు రూపంలో ఇప్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కొందరు ఉపాధ్యాయులు 75 శాతం నగదును అప్పుగా తీసుకున్నారని, వారికీ మిగిలిన 25శాతం సొమ్మును ఇప్పించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, జిల్లా గౌరవాధ్యక్షుడు వరుఖల అప్పయ్య శాస్త్రి, నగర శాఖ అధ్యక్షుడు కె.డేవిడ్‌లివింగ్ స్టన్ పాల్గొన్నారు.

28న ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా


రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అఖిల భారత జీవిత బీమా సంస్థ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన మహాధర్నా నిర్వహిస్తున్నట్టు రూరల్ బ్రాంచి అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా తెలిపారు. 68 సంవత్సరాలుగా కమీషన్‌లో ఎదుగుదల లేకున్నా పాలసీల విలువ పెరుగుదలతో సర్దుకుపోతున్నామన్నారు. కమీషన్ పెంచమని, జీతాలు ఇవ్వాలని, బోనస్ ప్రకటించాలని కోరడం లేదు, పాత కమీషన్ రేటునే కొనసాగించమని సంస్థను కోరుతున్నామన్నారు.

వరద బాధితులకు సహాయం

సీటీఆర్ఐ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాజమహేంద్రవరంలోని సంజీవయ్య నగర్‌కు చెందిన శ్రీ బాలాజీ విద్య నికేతన్ విద్యార్థులు సేకరించిన రూ.20,000 చెక్కు, మున్సిపల్ కాలనీకి చెందిన ప్రతిభ ఒకేషనల్ నర్సింగ్ కళాశాల సేకరించిన రూ.10,000 చెక్కు తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో బేసరి చిన్ని సారథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు అందచేశారు.